
సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 29 । జూన్ । 2025





**మానవ అక్రమ రవాణా ముఠా అరెస్ట్**

మానవ అక్రమ రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. 8లో▸



**పీవీ సేవలు చిరస్మరణీయం**

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పీవీ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/26.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

## న్యూస్‌రీల్

### మంత్రి 'తుమ్మల'ను కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తూ..

కైలాస్‌నగర్: డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాలతో సంబంధం లేకుండా రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ చేసినందుకు గాను మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

### వారికి అనుమతివ్వొద్దు..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

కైలాస్‌నగర్: పట్టణంలో తొలగించిన వీధి వ్యాపారులను మళ్లీ అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీ చౌక్‌ల్లో వ్యాపారం కొనసాగించేలా అవకాశం ఇవ్వొద్దని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అధ్యక్షుడు దినేశ్ మటోలియా మాట్లాడుతూ.. అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీ చౌక్‌ల్లో మళ్లీ తోపుడుబండ్లను ఏర్పాటు చేయడానికి సిద్ధపడినట్లుగా తెలుస్తుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిబండ్లు పెట్టి వ్యాపారం చేయించాలని చూస్తే తాము కూడా దు కాణాలు మూసి వేసి రోడ్లపైకి వచ్చి వ్యాపారం చేస్తామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ నాయకులు తదితరులున్నారు.

### 'మంత్రి జూపల్లి చెప్పినవన్నీ అబద్ధాలే'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర అప్పులపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పిన మాటలన్నీ అబద్ధాలేనని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల ఆయన పర్యటనతో జిల్లాకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. నూతన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులను ప్రస్తావించకుండా ఈ ప్రాంతవాసులకు నిరాశ మిగిల్చారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.8లక్షల కోట్లు అప్పు చేసిందని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో రూ.5 వేల కోట్లతో అభివృద్ధి జరిగిన మాట వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇందులో పార్టీ నాయకులు నారాయణ, అజయ్, నర్సింగరావు, ప్రహ్లాద్ తదితరులున్నారు.

### పండరీపూర్‌కు ప్రత్యేక రైలు

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన పండరీపూర్‌కు జూలై 5న ఆదిలాబాద్ నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు స్థానిక స్టేషన్ మేనేజర్ సీఆర్‌ఎం మీనా తెలిపారు. ఈ రైలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 6న సాయంత్రం పండరీపూర్ నుంచి ఆదిలాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ఉచిత శిక్షణ

కైలాస్‌నగర్: జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థ, ఈజీఎంఎం ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ పర్యవేక్షణలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్డీవో రాథోడ్ రవీందర్ ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ), గ్రాఫిక్ డిజైనింగ్, డీటీపీ, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, ఆటోమోబైల్ 2, 3 వీలర్ సర్వీసింగ్, ఎలక్ట్రీషియన్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్–సర్వీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యాగ్ మేకింగ్, బేసిక్ అడ్వాన్స్‌డ్ బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ కోసం 8వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ డిప్లొమో చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. రెండు నుంచి 6 నెలల వరకు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధి సైతం కల్పించనున్నట్లుగా పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 9133908000, 9133908111 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# హ్యాట్సాఫ్.. సార్

**వృత్తి ధర్మం** పాటిస్తూనే సర్కారు బడిపై నమ్మకం కలిగేలా వ్యవహరిస్తున్నారు పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు. బోధించే పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రైవేట్ ఆర్భాటాలకు పోకుండా సర్కారు బడి నాణ్యమైన విద్యకు కేరాఫ్ అనేలా వ్యవహరిస్తున్నారు. కొందరు పిసినారి అని హేళన చేస్తున్నా పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఇలాంటి గురువులు 14 మంది ఉన్నారు. గురుతర బాధ్యత నిర్వహిస్తున్న ఆ సార్లకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. – ఆదిలాబాద్‌టౌన్

సండే స్పెషల్

- ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలు
- సర్కారు బడుల బలోపేతానికి చొరవ
- తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే యత్నం
- ఆదర్శం.. ఈ ఉపాధ్యాయులు



ప్రభుత్వ పాఠశాలలో తన కూతురును చేర్పించిన చందన్‌బాబును సన్మానిస్తున్న డీఈవో (ఫైల్)

జిల్లాలో 2,500 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో వెయ్యి మందికి పైగా తమ పిల్లలను ప్రైవేట్‌లో చదివిస్తుండగా.. 14 మంది మాత్రం సర్కారు బడికే జై అంటున్నారు. తాము చదువు చెప్పే పాఠశాలలో కొందరు ఇంటికి సమీపంలో ఉన్న బడిలో మరికొందరు చదివిస్తున్నారు. వీరిలో తాంసి మండలంలోని కప్పర్ల పాఠశాలలో బోధిస్తున్న ఎస్.గంభీర్, తలమడుగు మండలం బరంపూర్ పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, అమరేందర్, బేల మండలం అవాల్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయుడు నాందేవ్, రంకం పాఠశాలలో ఎం.చంద్రకాంత్, ఉట్నూర్ పాఠశాలలో రవికుమార్, శ్యాంపూర్ పాఠశాలలో రవీందర్, బజార్‌హత్నూర్ పాఠశాలలో చంద్రబాను, సోనేరావు, బుర్కపల్లి పాఠశాలలో లింబాజీ, ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో రవికుమార్, ఇంద్రవెల్లి మండలం గౌరపూర్ పాఠశాలలో ఆడె సురాజీ ఉన్నారు.

### మనం ఆదర్శంగా ఉంటేనే..



మాది తాంసి మండలంలోని జామిడి. నేను ఇచ్చోడలో ఉంటాను. ప్రస్తుతం బజార్‌హత్నూర్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)గా పనిచేస్తున్నాను. నా కూతురు మేఘ నేను బోధించే పాఠశాలలోనే 8వ తరగతి చదువుతుంది. నాతో పాటు ప్రతిరోజు తీసుకెళ్తాను. గతంలో బజార్‌హత్నూర్ మండలంలో నికాండ్లీ పాఠశాలలో పనిచేశాను. 1 నుంచి 5వ తరగతి వరకు అక్కడే చదివించాను. ఉపాధ్యాయులను చూసే మిగతా వారు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపుతారనేది నా నమ్మకం. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది.

– సర్పే చందన్‌బాబు, స్కూల్ అసిస్టెంట్

### ప్రైవేట్‌లో రంగులమయమే..



మాది భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి. నేను బేల మండలంలోని రంకం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. మా బాబు శ్రీసాయినివాస్ ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో చేర్పించాను. ప్రైవేట్ పాఠశాలల్లో రంగులమయమే తప్ప నాణ్యమైన విద్యాబోధన ఉండదనేది నా అభిప్రాయం. ఉపాధ్యాయ తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే మిగతా వారు కూడా చేర్పించేందుకు ముందుకు వస్తారు.

– మస్కరి చంద్రకాంత్, ఉపాధ్యాయుడు

### నాతోపాటే ఇద్దరు పిల్లలు



నేను తాంసి మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. నా కూతురు ప్రజ్ఞశ్రీ 4వ తరగతి, బాబు కృష్ణ రెండో తరగతి చదువుతున్నారు. ఇద్దరిని నేను బోధన చేసే పాఠశాలలోనే చది విస్తున్నాను. గతంలో కుచులాపూర్‌లో పనిచేసిన సమయంలో అక్కడ చదివించాను. ప్రభుత్వ పాఠశాలలపై నాకు నమ్మకం ఉంది. నాతో పాటు బోధించే ఉపాధ్యాయులు అనుభవంతో పాటు ప్రావీణ్యంగలవారు. మా పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయి. నన్ను చూసి చాలా మంది తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

– సామనపెల్లి గంభీర్, ఉపాధ్యాయుడు

### అందరూ చదివించాలి



నేను ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లో ఉంటాను. నా కుమారుడు జాన్ సుచిత్ ఆరో తరగతి చదువుతున్నాడు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల గెజిటెడ్ నం.1లో చేర్పించాను. నేను ఒక టీచర్ సంఘంలో పనిచేస్తున్నాను. కేవలం ఉపాధ్యాయుల పిల్లలే కాదు.. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, రాజకీయ నాయకుల పిల్లలను చదివిస్తేనే సర్కారు బడులు బాగుపడతాయి. ప్రస్తుతం సర్కారు బడులు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వీటిని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉంది.

– నాందేవ్, అవాల్‌పూర్, ఉపాధ్యాయుడు

### మనపై మనకు నమ్మకం ఉండాలి



మాది ఉట్నూర్. మా పాప ప్రియాన్షి ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతోంది. రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాను. గతంలో నార్నూర్ మండలంలోని చిత్తగూడ ఉర్రమి పాఠశాలలో పనిచేసే సమయంలో అక్కడే చేర్పించాను. ఇటీవల బదిలీల్లో భాగంగా ఉట్నూర్ ప్రాథమిక పాఠశాలకు వచ్చాను. మనపై మనకు నమ్మకం ఉండాలి. మన పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తేనే తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అడగవచ్చు. వారిని మోటీవేట్ చేయవచ్చు. లేకుంటే వారు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు కంప్యూటర్ విద్యతో పాటు ఏఐ బోధన సైతం అందుతుంది.

– చిరివెల్ల రవికుమార్, ఉపాధ్యాయుడు

### ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: వాహన డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. స్థానిక పీఆర్‌టీయూ భవన్‌లో ది రాష్ట్రీయ చాలక్ ఏక్తా మంచ్ డ్రైవర్ల మహాసభ ముగింపు కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. సామాజిక వేత్త ముడుపు మౌనిష్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైద్యశిబిరంతో పాటు రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. డ్రైవర్లు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో డ్రైవర్లు ర్యాలీ చేపట్టారు. ఇందులో ఏక్తామంచ్ ఆలిండియా వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హబీబ్, రాష్ట్ర అధ్యక్షుడు సంజు, నాయకులు సోఫీ, ఇర్ఫాన్, బాలాజీ, అభిమన్యు, మహబూబ్, మొయిన్ తదితరులున్నారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. శనివారం జూమ్ ద్వారా జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, వైద్యసిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు ప్రారంభమైనందున పారిశుద్ధ్య నిర్వహణ లోపించి వ్యాధులు ప్రబలే అవకాశముందని పేర్కొన్నారు. అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సిబ్బంది తమ పరిధిలోని అన్ని గ్రామాల్లో జూలై 30 వరకు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలన్నారు. అవసరమైన వారికి ఓఆర్‌ఎస్, జింక్ టాబ్లెట్లు అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత, వైద్యాధికారులు పాల్గొన్నారు.

### అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

కైలాస్‌నగర్: జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీఆర్వో తిరుమల ప్రకటనలో తెలిపారు. జూన్ 30తో గడువు ముగియనున్నందున సెప్టెంబర్ 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అక్రిడిటేషన్ కార్డుదారులు ఈ నెల 30న డీపీఆర్వో కార్యాలయంలో సంప్రదించి కార్డుపై స్టిక్కర్ వేయించుకోవాలని ఆమె సూచించారు.

# 'వన'లక్ష్యం నెరవేరేనా!

- 'మున్సిపల్'లో వన మహోత్సవం జాడేది
- ఈ ఏడాది ఏర్పాటు చేయని నర్సరీలు
- మొక్కల కొనుగోళ్లపైనే బల్దియా దృష్టి
- ఇంకా ఖరారు కాని టెండర్ల ప్రక్రియ



గతేడాది పట్టణంలో ఏర్పాటు చేసిన బల్దియా నర్సరీ(ఫైల్)

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో వన మహోత్సవ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది బల్దియా ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేయలేదు. పట్టణ పరిధిలో నాటేందుకు అవసరమైన మొక్కలను ప్రైవేట్ నుంచి కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రూ.25లక్షల నిధులు కేటాయించారు. ఆసక్తి గల వారి నుంచి టెండర్లు స్వీకరిస్తున్నారు. అయితే ఈ ప్రక్రియలో జాప్యం అవుతుండడంతో నిర్ణీత సమయంలో మొక్కల సరఫరా సాధ్యమవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హరిత లక్ష్యం నెరవేరుతుందా అనే ప్రశ్న తలెత్తుతుంది.

**5 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ..**

పచ్చదనం పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా వర్షాకాలంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తోంది. గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఈ ఏడాది 7.50లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే మొక్కల సంరక్షణ కష్టతరమవుతుందనే ఉద్దేశంతో ఐదు లక్షలు నాటాలని మున్సిపల్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందులో హోం ప్లాంటేషన్ కింద ఇళ్లలో నాటేందుకు 2లక్షల పూలు, పండ్ల మొక్కలు అందించాలని నిర్ణయించారు. ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ చేయాలని భావించారు. అవెన్యూ ట్రీ ప్లాంటేషన్ కింద 2.50లక్షలు, మీడియన్ ప్లాంటేషన్ కింద మరో 50వేల చొప్పున నాటేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో నీడనిచ్చే వాటితోపాటు భారీవృక్షాలుగా ఎదిగే స్పటోడియా, గుల్‌మొహర్, మహగని, టేబుషియా రోషియా, నల్లమద్ది,కానుగ,రావి,మర్రివంటివి ఉండనున్నాయి.

**మొక్కల కొనుగోలుకు టెండర్లు ..**

పట్టణ పరిధిలో నాటేందుకు అవసరమైన మొక్కలను ప్రైవేట్ నర్సరీల నుంచి కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రూ.25లక్షలు కేటాయించారు. పట్టణానికి చెందిన ఏడుగురు వ్యక్తులు అధికారులు సూచించిన ఆయా రకాల మొక్కలను వివిధ ధరలకు సరఫరా చేస్తామని పేర్కొంటూ ఆయా నర్సరీల పేరిట కొటేషన్లు సమర్పించారు. బల్దియా అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు. ఇందులో తక్కువ ధరకు కోట్ చేసిన వారికి మొక్కల సరఫరా బాధ్యతలు అప్పగించేలా కసరత్తు చేస్తున్నారు. అయితే ఈప్రక్రియలో జాప్యం అవుతోంది. ఇప్పటికే వర్షాలు కురుస్తున్నందున పలు శాఖల ఆధ్వర్యంలో వనమహోత్సవం ప్రారంభించారు. త్వరితగతిన ఈప్రక్రియ పూర్తి చేసినట్లయితే సకాలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే చిన్నపాటి నర్సరీలు కలిగిన వారికి సరఫరా బాధ్యతలు అప్పగిస్తే వారు సకాలంలో ఎలా సరఫరా చేస్తారనే సందేహాలు సైతం వ్యక్తమవుతున్నాయి. అధికారులు కొటేషన్లు చూసి కాకుండా క్షేత్రస్థాయిలో నర్సరీలను పరిశీలించి చర్యలు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**రేపటి వరకు టెండర్లు ఖరారు**

వనమహోత్సవంలో భాగంగా పట్టణ పరిధిలో నాటనున్న మొక్కల సరఫరాకు సంబంధించి ఆసక్తి గల వారి నుంచి టెండర్లు స్వీకరించాం. ఏడుగురు కొటేషన్లు అందజేశారు. వాటిని పరిశీలిస్తున్నాం. తక్కువకు కోట్ చేసి మొక్కలు సరఫరా చేసే సామర్థ్యం కలిగిన వారికే అప్పగిస్తాం. నిర్దేశిత లక్ష్యాలు సాధించేలా మొక్కలు నాటి సంరక్షించడంపై దృష్టి సారిస్తాం.

– కార్తీక్, మున్సిపల్ డీఈ



రథాన్ని లాగడానికి పోటీపడుతున్న భక్తులు

# జయహో జగన్నాథా..

**జయహో** జగన్నాథా.. అంటూ భక్తులు పులకించిపోయారు. పూరి జగన్నాథుని నామస్మరణతో పట్టణ వీధులు మారుమోగాయి. ఇస్కాన్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మధుర జిన్నింగ్ నుంచి శనివారం చేపట్టిన పూరి జగన్నాథుని రథయాత్ర వైభవంగా సాగింది. సోదరుడు బలభద్ర, సోదరి సుభద్రతో కొలువుదీరిన ఆ స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తజనం పోటీపడ్డారు. ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్ బంగారుపిడి కలిగిన చీపుర్లతో ఊడ్చి యాత్రను ప్రారంభించారు. ఆద్యంతం శ్రీ ప్రణవానంద ప్రభూజీ బోధనలు, భక్తి గీతాలతో రథయాత్ర శోభాయమానంగా సాగింది. అనంతరం భక్తులకు ఇస్కాన్ ప్రతినిధులు ప్రసాద వితరణ చేపట్టారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. – ఆదిలాబాద్



మాట్లాడుతున్న శ్రీ ప్రణవానంద మహరాజ్, పక్కన ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

# కవ్వాల్‌కు కొత్త పులులు!

- మహారాష్ట్ర నుంచి తరలించే యత్నం
- అంగీకరించిన తడోబా అధికారులు
- ఎన్‌టీసీఏ ఓకే చెబితేనే టైగర్ల రాక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కవ్వాల్‌కు కొత్త పులులు రానున్నాయి. మహారాష్ట్ర పులులను ఇక్కడికి తరలించేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో విస్తరించిన కవ్వాల్ కోర్ ప్రాంతంలో నేటికీ ఒక్క పులి కూడా శాశ్వతంగా నివాసం ఏర్పరుచుకోలేదు. మరోవైపు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌నుంచి పదుల సంఖ్యలో పులులు వలసవస్తూ.. పోతున్నాయి. ఇక్కడి వాతావరణం అనుకూలించిన మేరకు సంచరిస్తూ వెళ్లిపోతున్నాయి. తోడు, ఆవాసం, మానవ సంచారం కారణంగా పులులు వచ్చి తిరిగి వెళ్లి పోతున్నాయి.

**ఆడ, మగ కలిపి ఐదు దాకా..**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్‌లో కొన్ని పులులు శాశ్వత నివాసమేర్పరుచుకోగా, ఆదిలాబాద్, ఖానాపూర్, ఇచ్చోడ, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల డివిజన్‌ల వరకు వాటి సంచారం ఉంది. అయితే చాలా పులులు ఇక్కడ సంచరించి కొద్ది రోజులకే తిరిగి వెళ్లిపోతున్నాయి. ఈ క్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లను టైగర్ కన్జర్వేషన్‌గా గుర్తిస్తూ అటవీశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో అక్కడి పులుల రక్షణకు వీలు కలగనుంది. మరో అడుగు ముందుకేసి మహారాష్ట్రలోని తడోబా పులులనే ఇక్కడికి తరలించేందుకు ప్రతిపాదనలు పంపగా, అక్కడి అధికారులు అంగీకరించడంతో కవ్వాల్‌కు కొత్తపులులు వచ్చే అవకాశాలున్నాయి. ఆడ, మగ కలిపి ఐదు వరకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఎన్‌టీసీఏ (జాతీయ పులుల సంరక్షణ సంస్థ) ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయనుంది.

**చివరికి తరలింపునకే మొగ్గు**

మహారాష్ట్ర పులులు భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లాకు వస్తాయనే దూరదృష్టితో 13ఏళ్ల క్రితం కవ్వాల్ కేంద్రంగా 2వేల చ.కి.మీటర్లకు పైగా అటవీ భూభాగాన్ని పులుల అభయారణ్యంగా నోటిఫై చేశారు. అయితే అప్పటినుంచి ఇప్పటిదాకా కోర్ ఏరియాలోనే పులులు నివాసమేర్పరుచుకోలేదు. ఏళ్లుగా అనేక ప్రయత్నాలు చేస్తూ రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. మానవ కార్యక్రమాలను తగ్గించేందుకు కోర్ పరిధిలో ఉండి, పులుల రాకపోకల మార్గంలో ఉన్న గ్రామాలను గుర్తించి తరలించడం ప్రారంభించారు. అయినా, పలు కారణాలతో పులులు రాలేదు. చివరకు మహారాష్ట్రలోని తడోబాలో అధికసంఖ్యలో ఉంటూ ఇరుకు ఆవాసాలు, సంరక్షణ కష్టమవుతున్న నేపథ్యంలో కవ్వాల్‌కు పులులను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పులుల సంచారంతో తమకు ఇబ్బంది కలుగుతుందని స్థానిక గిరిజన రైతులు, అటవీ ప్రాంత సమీప గ్రామాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశముంది.



మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి (ఫైల్)

**సంరక్షణ సవాలే..!**

కవ్వాల్‌లో విశాల భూభాగం పులుల జీవనానికి అనుకూలంగా ఉంది. కొంతకాలంగా ఇక్కడ గడ్డి క్షేత్రాల పెంపు, శాకాహార జీవుల పెరుగుదలతో పాటు కోర్ గ్రామాలైన కడెం మండలం రాంపూర్, మైసంపేటను తరలించారు. అయితే వలస పులులు సంచరిస్తున్న సమయంలో ఇదివరకు అనేక చోట్ల వేట ముప్పు ఎదుర్కొన్నాయి. విద్యుత్ కంచెలు, వేటకారణంగా అభయారణ్యంలో మృత్యువాత పడ్డాయి. రూ.కోట్లు ఖర్చు పెట్టి సంరక్షణ చర్యలు చేపట్టినా ఇక్కడి పరిస్థితులకు సరిపోక అనేక పులులు తిరిగి వెళ్లిపోయాయి. తాజాగా అధికారులు ఇక్కడికి తరలించే పులుల సంరక్షణ స్థానిక అధికారులకు సవాల్‌గా మారనుంది. సిబ్బంది కొరతతో పాటు స్థానిక పరిస్థితులు, అడవిలో మానవ అలజడి కొత్త పులుల జీవనంపై ప్రభావం చూపనుంది. మరోవైపు పునరావాస గ్రామాల వాసులకు పూర్తిస్థాయిలో హామీలు అమలు చేయలేదని పేర్కొంటూ పాత గ్రామాల్లోకి వెళ్లేందుకు సిద్ధపడి నిరసనలు చేపట్టారు. కవ్వాల్ కోర్ ప్రాంతాల్లో ఇప్పటికే మానవ కార్యకలాపాలు, పంట చేన్లు ఉన్నాయి. ఈ క్రమంలో జాతీయ జంతువు రక్షణకు ఇక్కడి అధికారులు మరింత శ్రమించాల్సి ఉంది.

## క్లుప్తంగా

### రేపు మహిళా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న 25 ఏళ్ల లోపు మహిళల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో గల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ నెట్స్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ కోదాటి ప్రదీప్ తెలిపారు. పాల్గొనే క్రికెటర్లు వారి వెంట క్రికెట్ కిట్‌ను తీసుకుని ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా రిపోర్టు చేయాలని సూచించారు. ఎంపికైన జట్టు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### 5న పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో కంపెనీ కోటా కింద ఉన్న 150సీట్లను జూలై 5న కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ పీ. శ్రీనివాస్‌రావు శ నివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్స్‌లో 30, సివిల్‌లో 30, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో 30, మెకానికల్‌లో 30, మైనింగ్‌లో 30 సీట్లు ఉన్నాయన్నారు. సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే ఈ సీట్లు పొందే అవకాశం ఉందని, ఇది వరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ ప త్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల న్నారు.

### విఠలేశ్వర ఆలయంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ నైలు

భైంసారూరల్: మండలంలోని మహగాం విఠలేశ్వర ఆలయంలో చోరీ జరిగినట్లు సీఐ నైలు తెలిపారు. శనివారం ఉదయం ఆలయానికి భక్తులు తాళాలు పగిలి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భైంసారూరల్ సీఐ నైలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలో కానుకలు దొంగిలించినట్లు గుర్తించారు. హుండీలో సుమారు రూ.22వేల నగదు అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు.

### పేకాట ఆడుతున్న ముగ్గురి అరెస్టు

జన్నారం: మండలంలోని చింతగూడ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా నలుగురు పారిపోయినట్లు తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుండి రూ.10,600 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు**

పేకాట నిందితులను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన దండేపల్లి మండలంలోని చింతపల్లికి చెందిన అలిశెట్టి సత్తయ్య, రాజంపేటకు చెందిన మెంగని శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.



## ప్రకృతి సోయగం... మిట్టే జలపాతం


దట్టమైన అడవిలో ప్రకృతి సోయగాల నడుమ మిట్టే (సప్తగుండాలు) జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తోంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో రామ గుండం, లక్ష్మణ గుండం, సీత గుండం, భీమ గుండం, సవతిగుండం, చిరుతల గుండం, బుగ్గ గుండం ఉన్నాయి. సప్త గుండాలను కలిపి మిట్టే జలపాతంగా పిలుస్తారు. పూర్వం రాముడు, సీత, లక్ష్మణుడు వనవాసానికి వచ్చిన సమయంలో ఇక్కడ స్థిరనివాసం ఏర్పర్చుకున్నట్లు పూర్వీకులు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. - లింగాపూర్



రామ గుండం



లక్ష్మణ గుండం



భీమ గుండం

# మరో సూపర్ బజార్‌కు మంగళం..!

- ఇప్పటికే నస్పూర్‌లో మూసివేత
- ఈ నెల 30తో రామకృష్ణాపూర్‌లో క్లోజ్
- సింగరేణి నిర్ణయంతో కార్మికులపై భారం
- రాయితీ సరుకులకు కార్మిక కుటుంబాలు దూరం
- ఉనికి కోల్పోనున్న కార్మిక క్షేత్రం

**సింగరేణి సంస్థ కార్మికులకు మేలురకమైన సరుకులు అందించేందుకు ఏర్పాటు చేసిన సూపర్ బజార్లకు మంగళం పాడుతోంది. ఇటీవలే నస్పూర్‌లోని సూపర్ బజార్‌ను మూసివేసిన సంస్థ యాజమాన్యం ఇప్పుడు రామకృష్ణాపూర్ సూపర్ బజార్‌పై కన్నేసింది. జనరల్ మేనేజర్ కార్యాలయం, వర్క్‌షాప్, టింబర్ యార్డు, స్టోర్స్.. ఇలా అనేక కార్యాలయాలు, భూగర్భ గనులతో తులతూగిన రామకృష్ణాపూర్ పట్టణం.. సూపర్ బజార్ మూసివేతతో ఉనికినే కోల్పోయే దుస్థితికి చేరనుంది. ఎంతో శ్రమకోర్చి చెమటోడ్చిన బొగ్గు గని కార్మికులు ఇప్పుడు సింగరేణి సూపర్ బజార్లకు నోచుకోని పరిస్థితి నెలకొంది. బొగ్గు గనులతో పాటు కార్మికుల సంక్షేమానికి కూడా యాజమాన్యం గండి కొడుతోందన్నా విమర్శల నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.**



మూతపడనున్న ఆర్‌కేపీ సూపర్ బజార్

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి సూపర్ బజార్ ఈ నెలాఖరుతో మూతపడనుంది. పైనుంచి వెలువడిన ఆదేశాల మేరకు మూసివేతకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇక్కడి సరుకులను మందమర్రి సూపర్‌బజార్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. సింగరేణి కార్మికులకు ఇప్పటి వరకు సూపర్ బజార్‌లు నిత్యావసర సరుకులే కాకుండా ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా అందిస్తూ వచ్చాయి. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్దెర రూపంలో నిత్యావసర సరుకులు లభిస్తుండేవి. ఎలక్ట్రానిక్ పరికరాలకు ఈఎంఐ ద్వారా చెల్లించే వెసులుబాటు ఉండేది. ఉద్యోగుల వేతనం నుంచి డబ్బులు కట్ చేసేవారు. అయితే కొన్ని రోజులుగా ఇక్కడి సూపర్‌బజార్లో నిత్యావసర సరుకులు నిలిపివేయడమే కాకుండా మొత్తానికే ఎత్తివేస్తున్నారని తెలిసి స్థానికులు అవాక్కవుతున్నారు. సంస్థ మనుగడ కోసం తమ చెమటను ధారబోసినా కనీసం సూపర్ బజార్లకు కూడా నోచుకోక పోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సూపర్ బజార్ అంటే ఓ బ్రాండ్..**

సింగరేణి వ్యాప్తంగా సంస్థ సూపర్ బజార్లంటే ఒక బ్రాండ్ ఇమేజ్ ఉండేది. రామకృష్ణాపూర్‌లో షాపు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని సూపర్‌బజార్ ఏరియా అనే పేరుతో పిలిచేవారు. ఇక్కడి సూపర్ బజార్లో నిత్యావసర సరుకులే కాకుండా టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కార్మికులకు అందుబాటులో ఉండేవి. గ్యాస్ సిలిండర్ల పంపిణీ కూడా వీటి ద్వారానే జరిగేది. ఇలాంటి సూపర్ బజార్‌ను ఉన్నట్టుండి ఒక్కసారిగా మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దాల క్రితం ప్రారంభించిన ఆర్‌కేపీ సూపర్ బజార్ ఇప్పుడు మూసివేస్తున్నారని తెలిసి పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సూపర్ బజార్ పర్యవేక్షణ జరిపే ఉద్యోగి ఈ నెలాఖరుతో రిటైర్ అవుతున్న నేపథ్యంలో అతని స్థానంలో మరొకరిని నియమించి సరుకులను అంటుబాటులో ఉంచి షాపును కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ ఇలా మూసివేయడంపై కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**మొన్న నస్పూర్..నేడు ఆర్‌కేపీ**

సింగరేణి వ్యాప్తంగా సూపర్ బజార్లకు స్వస్తి పలకాలని భావిస్తున్న యాజమాన్యం వీటి మూసివేతే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటికే శ్రీరాంపూర్ సూపర్ బజార్ మూసివేతకు గురికాగా కొద్ది రోజుల క్రితమే నస్పూర్ సూపర్ బజార్‌ను మూసివేశారు. ఉన్నతాధికారుల చర్యలు చూస్తుంటే సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ ఎత్తివేయడమే సంస్థ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుందని కార్మికుల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా ఆర్‌కేపీ సూపర్‌బజార్ మూసివేతతో ఈ ప్రాంతమే ప్రాభవం కోల్పోతుందని చెప్పాలి. ఇప్పటివరకు వీటిపైన ఆధారపడి ఉన్న సింగరేణి కార్మికులు ఇక ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రైవేటుకు ధీటుగా డీమార్ట్ స్థాయిలో చక్కటి సూపర్ మార్కెట్‌వలే రామకృష్ణాపూర్ సూపర్ బజార్‌ను మార్చుకునే బిల్డింగ్, స్థలం అన్నీ ఉన్నప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా కాలగర్భంలో కలిపివేయడంతో కార్మికులు, స్థానికులు అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రధాన కార్మిక సంఘాలు నోరు మెదపకుండా ఉండడంతో యూనియన్ నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పుట్టినరోజే ఆగిన ఊపిరి

- 12 రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఓడిన చిన్నారి

ఆదిలాబాద్‌టౌన్: నవమాసాలు మోసి.. కంటికి రెప్పలా కాపాడిన ఓ తల్లికి తీరని గర్భశోకం మిగిలింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఇద్దరు పిల్లలను రోడ్డు ప్రమాదం కబళించింది. పక్షం రోజుల క్రితం ఉట్నూర్ మండలంలోని బిర్సాయిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడిని, తల్లిని కోల్పోయిన సృజనిత శనివారం కుమార్తెను కూడా కోల్పోయింది. ఉన్న ఇద్దరు పిల్లలు దూరం కావడం ఆ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. దైవదర్శనానికి వస్తుండగా ఈనెల 16న బిర్సాయిపేట మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. అందులో ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన డాక్యుమెంట్ రైటర్ ఈర్ల రాజు, అతని భార్య సృజనిత, అత్తమ్మ గంట విజయ, కుమారుడు సహర్ష్‌తో పాటు కుమార్తె అద్యశ్రీ (12) ప్రయాణించారు. సహర్ష్, గంట విజయ మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన అద్యశ్రీని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 12 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆ చిన్నారి శనివారం తన పుట్టిన రోజునాడే తనువు చాలించింది. పుట్టిన రోజునాడే చిన్నారి దూరం కావడంతో తల్లిదండ్రులు తీవ్రంగా తల్లడిల్లుతున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే చిన్నారుల మరణంతో కాలనీలోనూ తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



అద్యశ్రీ (ఫైల్)

### ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

తాండూర్: ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కన్నెపల్లి మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన విఘ్నేష్ (21) శనివారం తెల్లవారుజామున తమ సొంత ట్రాక్టర్‌లో ఇసుక నింపుకుని టేకులపల్లి నుంచి అచ్చలాపూర్‌వైపు వస్తుండగా అదుపుతప్పి ఒర్రెలో పడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



విఘ్నేష్ మృతదేహం

### చికిత్స పొందుతూ యువకుడు..

ముధోల్: ఈ నెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపారు. మండలంలోని వద్తాలా గ్రామానికి చెందిన పవన్‌కుమార్ (28) ఈనెల 18న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులకు చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### లారీ బోల్తా

సాత్నాల: భోరజ్ మండల కేంద్రంలోని 44వ అంతర్రాష్ట్ర రహదారిపై చెక్‌పోస్ట్ వద్ద శనివారం అదుపుతప్పి లారీ బోల్తా పడింది. హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హర్యానాకు చెందిన మతిన్ లారీలో జైపూర్ నుంచి చెన్నైకి ఎల్ఈడీ బల్బులు రవాణా చేస్తుండగా భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఘటన సమయంలో చెక్‌పోస్ట్ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

### మూడిళ్లలో చోరీకి యత్నం

ముధోల్: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో శుక్రవారం రాత్రి మూడిళ్లలో చోరీకి యత్నించినట్లు ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపారు. గుర్తు తెలియని దుండగులు రాత్రిపూట తాళం వేసిన ఇళ్లలో చోరీకి యత్నించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎలాంటి నగదు, ఆభరణాలు చోరీ కాలేదన్నారు. బాధితులు సట్లొల్ల గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. చోరీకి యత్నించిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

### బాసరలో సీసీ కెమెరాలు ధ్వంసం

బాసర: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కొంత మంది దుండగులు ధ్వంసం చేశారు. పీఎంశ్రీ పథకం కింద ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి రెండింటిని ఎత్తుకెళ్లారు. శనివారం ప్రధానోపాధ్యాయుడు నరసయ్య పాఠశాలను తెరిచే సరికి సీసీ కెమెరాలు చిందరవందరంగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. గతంలో సైతం పాఠశాల ప్రాంగణంలోకి చొరబడి దుశ్చర్యలకు పాల్పడ్డారని, అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వ పాఠశాల అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పాఠశాలకు రాత్రిపూట భద్రత కరువైందని ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



ధ్వంసమైన సీసీ కెమెరా

### హీరాసుక్క ఆశయ సాధనకు కృషి

బజార్‌హత్నూర్: ఆదివాసీల ఆరాధ్య దైవం, ఆదివాసీల గోండి ధర్మ గురువు హీరాసుక్క ఆశయ సాధనకు కృషి చేస్తామని పర్ధాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్వ నాగేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని యేసాపూర్‌లో హీరాసుక్క విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులు ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉయికే సుదర్శన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సిడం కిషన్, ఐటీడీఏ పీవీటీజీ అధ్యక్షుడు మేస్రం మనోహర్, కొడుజీ, మడావి నరహరి, నర్సయ్య, పాండురంగ్, కొడప నగేష్, నైతం రమేష్, ఉత్తం, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే దివాకర్‌పై కేసుపై మీ స్పందనేంటి?

- మంచిర్యాల పోలీసులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత నడిపెల్లి దివాకర్‌రావు సహా మరో 29 మందిపై కేసులో వైఖరిని తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణ జూలై 1కి వాయిదా వేసింది. బెల్లంపల్లి చౌరస్తా వద్ద జాతీయ రహదారి 363పై అనుమతి లేకుండా ధర్నా నిర్వహించారంటూ దివాకర్‌రావు సహా 29 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ దివాకర్‌రావు, మరో 29 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. క్రిమినల్ కేసులో నిందితులుగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే సహా బీఆర్ఎస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ వర్గాలతో జరిగిన ఘర్షణలో బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. పోలీసులు మాత్రం బీఆర్ఎస్‌వారిపైనే కేసు నమోదు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే సహా ఇతరులను అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ, దర్యాప్తు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత–2023 కింద చట్టబద్ధంగా దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు.

## మానవ అక్రమ రవాణా ముఠా అరెస్ట్

- ముగ్గురిపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: మానవ అక్రమ రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. భీంపూర్ మండలానికి చెందిన ఓ బాలిక బంధువుల ఇంట్లో ఉంటూ పదోతరగతి చదువుతోంది. ఈ నెల 2న ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా ఘంటంజీ తాలుకా కిన్హి గ్రామానికి చెందిన భార్యాభర్తలు నిర్మల బాపూణ్య ఆత్రం, బాపూణ్య రాజారాం ఆత్రం బాలిక ఇంటికి వచ్చారు. కిన్హిలో ఓ కార్యక్రమం ఉందని మాయమాటలు చెప్పి ఆదిలాబాద్‌కు తీసుకొచ్చారు. బస్సులో నాగ్‌పూర్‌కు తీసుకెళ్లిన తర్వాత అక్కడి నుంచి రైలులో రాజస్థాన్‌లోని కోటాకు తీసుకెళ్లి కరణ్ అలియాస్ భగవత్ మీనస్‌కు అప్పగించారు. అతని వద్ద నుంచి రూ.10వేలు తీసుకున్నారు. కరణ్ బాలికను తన ఇంట్లో అక్రమంగా నిర్బంధించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి బంధువులు ఈ నెల 22న భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులు ఆ బాలికను రైలులో ఆదిలాబాద్‌కు తీసుకురాగా 25న ఇంటికి చేరుకుంది. నిందితులు శనివారం రైలుమార్గంలో ఆదిలాబాద్ నుంచి పారిపోతుండగా రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సెల్ ఫోన్‌తో పాటు రూ.2వేల నగదును స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, భీంపూర్ ఎస్సై బి.పీర్ సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం

- నిధులు దుర్వినియోగం చేస్తున్న పీవోను బదిలీ చేయాలి
- ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం అధ్యక్షుడు సోనేరావు





మాట్లాడుతున్న కొడప సోనేరావు

ఆదిలాబాద్‌అర్బన్: పీవీటీజీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ నిధులు సక్రమంగా వినియోగించకుండా దుర్వినియోగం చేస్తే ఊరుకునేది లేదని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సోనేరావు అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కొలాం, తోటి, చెంచు, కొండరెడ్ల నిధులు దుర్వినియోగం చేస్తున్న ఐటీడీఏ పీవోను బదిలీ చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించకుండా వైద్యారోగ్యం, పౌష్టికాహారంపై గిరిజన పల్లెలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పక్కా ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యంగా ఉన్నారని, గ్రామాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటికీ మంచినీటికి దూరంగా ఉన్నాయన్నారు. గిరిజన గ్రామాలను మెయిన్ రోడ్డుకు అనుసంధానం చేయకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్నారు. కొన్ని గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదన్నారు. ఉమ్మడి జిల్లా కొలాం, ఆదివాసీ గిరిజన గ్రామాలకు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వ నిధులపై ఆరా తీసి సక్రమంగా ఖర్చుచేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్‌రావు, గౌరవ అధ్యక్షులు టేకం రాజు, మడావి కిషన్, నాయకులు టేకం లక్ష్మణ్, కుమ్రరాజు, టేకం జంగు, టేకం గణేశ్, బాలు, మడావి జంగు, తదితరులు పాల్గొన్నారు.

## సీతక్క ఎదుగుదల ఓర్వలేకనే విమర్శలు



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మంత్రి సీతక్క ఎదుగుదల ఓర్వలేకనే కొంతమంది అగ్రవర్ణ రాజకీయ పార్టీల నాయకులు ఆమెపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. శనివారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారులో గల కుమురం భీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మంత్రి సీతక్కను దూషిస్తున్నారన్నారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెందూర్ దాదిరావు, వెట్టి మనోజ్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్రా పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శనివారం జీఎం కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జీఎం దేవేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య మాట్లాడుతూ కేకే ఓసీలో విధులు నిర్వహించే క్వార్టర్‌లేని కార్మికులకు 9 శాతం ఇంటి అద్దె చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు ప్లేడేలు వర్తింప జేయాలని, క్యాంటీన్లలో భోజన సౌకర్యం కల్పించాలని, ఎస్అండ్‌పీసీ సిబ్బందికి నాణ్యమైన యూనిఫాంతో పాటు రెయిన్‌కోట్స్ ఇవ్వాలని, కేకే–6 గని, శ్రావణ్‌పల్లి గనులను త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు.